ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
సోమవారం 20 అక్టోబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 23.0

జీఎస్టీ సంస్కరణలు సామాన్యులకు వరం

» మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): 'జీఎస్టీ సంస్కరణలు సామాన్యులకు ఒక వరం, ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చాయి' అని గృహ నిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు లో ఆదివారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ బైక్ ర్యాలీని ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల కారణంగా దేశ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయన్నారు. సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించేందుకు, జీఎస్టీ ఫలాలు ప్రతి కుటుంబానికి అందాలన్న లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు.


జీఎస్టీ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సారథి

జీడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, నూజివీడు పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీశ్, మునిసిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద బాణసంచా దుకాణంలో రద్దీ


● బాణసంచా దొరికిందోచ్..
ఏలూరులో బాణసంచా కొనుగోలుదారుల ఆనందం

ఆనంద రవళి.. దీపావళి

జిల్లావ్యాప్తంగా సోమవారం దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవడానికి జిల్లావాసులు సన్నద్ధమవుతున్నారు. ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తాత్కాలిక లైసెన్సులు తీసుకుని జిల్లాలో మూడు రోజుల పాటు బాణసంచా విక్రయించేందుకు పలుచోట్ల దుకాణాలు ఏర్పాటు చేశారు. పండుగ సందర్భంగా ఏలూరు నగరంతో పాటు మిగిలిన పట్టణాల్లో పువ్వులు, పండ్ల మార్కెట్‌లు, వస్త్ర, బంగారం దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి.



రూ. 25.38 కోట్లు

ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు

ఏలూరుసిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలకు వేతన బకాయిలు ఇంకా చెల్లించాల్సి ఉంది. ఇటీవల సెప్టెంబరులో అప్పటివరకు ఉన్న బకాయిలు చెల్లించడం కోసం జిల్లాకు రూ. 111 కోట్లు కేటాయించారు. అయితే ఇంకా రూ. 25.38 కోట్లు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 3.83 లక్షల కుటుంబాలు ఉన్నాయి. వీటిలో 6.92 లక్షల మంది ఉపాధి కూలీలు వేతనదారులుగా ఉన్నారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఈ ఏడాది ఉపాధి పనులకు 3.45 లక్షల మంది హాజరవుతున్నారు. జిల్లాలో రూ.340 కోట్లు విలువైన పనులు జరుగుతున్నాయి. రోజువారీ వేతనం బాగా పెరిగింది. రోజువారీ వేతనాలను పరిశీలిస్తే రోజుకు రూ.292 వస్తోందని డ్వామా శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఇక కూలీల విషయానికొస్తే రోజువారీ 1.08 లక్షల మంది పనులకు హాజరవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లిస్తూ వస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు మొత్తం 3,70,980 మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో పనులు నిర్వహించగా వారికి సంబంధించి రూ. 255.29 కోట్లు వేతనాలుగా చెల్లించాల్సి ఉండగా , 3,33,355 మంది కూలీలకు సంబంధించి రూ. 229.90 కోట్లు వేతనాలుగా చెల్లించారు. ఇంకా జిల్లాలో 37,625 మంది కూలీలకు వేతనాలుగా రూ. 25.38 కోట్లు చెల్లించాల్సి ఉంది. త్వరలో పూర్తిస్థాయిలో వేతన బకాయిలు చెల్లిస్తామని డ్వామా పీడీ కె.వెంకట సుబ్బారావు తెలిపారు.

ముహూర్తం ఎప్పుడు..?


కొత్త పట్టాదార్ పుస్తకాల అందజేతలో జాప్యం

» నెలల తరబడి పంపిణీ పెండింగ్
» జిల్లాలో 80,614 మంది ఎదురుచూపులు

ఏలూరు,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి ముహూర్తం కుదరలేదు. ప్రభుత్వ రాజముద్రతో ముద్రించినవి జిల్లా కేంద్రానికి వచ్చి మూడు నెలలు కావొస్తోంది. జిల్లాలో 80,614 పట్టాదార్ పుస్తకాలు సిద్ధం చేశారు. అయితే ఇంకా ఆర్డీవోల నుంచే మండల కేంద్రాలకు చేరలేదని చెబుతున్నారు. పాస్ పుస్తకాలు ఎప్పుడి స్తారంటూ కాళ్లరిగేలా రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. భూములు అమ్ము కోవాలన్నా లేదా కొనుగోలు చేయడంతో పాటు పంట రుణాలు పొందేందుకు పట్టాదారు పాస్ పుస్తకం కలిగి ఉండడం తప్పనిసరి. వైసీపీ ప్రభు త్వంలో జగనన్న భూ హక్కు పత్రంగా ఆయన చిత్రపటంతో ముద్రించి పంపిణీ చేశారు. వీటి స్థానంలో 2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. వాటి స్థానంలో కొత్తవి రాజముద్రతో సిద్ధం చేసి అంది స్తామని చంద్రబాబు ప్రకటించారు. కూటమి అధికారం లోకి వచ్చాక ఈ ఏడాది ఆగస్టు 15 తేదీ నాటికి ఇస్తామని చెప్పినా ఆపై ఎటువంటి కదలిక లేకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు.

పెండింగ్ ఎందుకో?

నయాపైసా ఖర్చు లేకుండా, తప్పులు లేకుండా రైతులకు పారదర్శకంగా రైతులకు ప్రభుత్వ రాజముద్రతో భూ యాజమాన్య హక్కు పత్రాలను (పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేయడానికి ప్రభుత్వం చేపట్టిన కసరత్తులు పూర్తయ్యాయి. రైతులకు ప్రభుత్వ రాజముద్రతో భూ యాజ మాన్య హక్కు పత్రాలను(పట్టాదారు పాస్ పుస్తకాలు) ఆకర్షణీయంగా సిద్ధం చేశారు. జిల్లాలో మూడో విడత భూముల రీ సర్వేను ప్రభుత్వం



చేపట్టింది. రెండు విడతల్లో చేపట్టిన సమగ్రంగా పూర్తి చేశారు. మార్పు లు, చేర్పులు వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా కొత్త పట్టాదారు పుస్త కాలను ముద్రింప చేసింది. జిల్లాలో ఏలూరు డివిజన్‌లో 36,267, జంగారెడ్డి గూడెం డివిజన్‌లో 42,674, నూజివీడు డివిజన్‌లో 1,473 కలిపి మొత్తం 80,614 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

తప్పులు సరిదిద్దుతున్నారా?

కొత్త పుస్తకాల్లోనూ తప్పులు పునరావృతమై ఉండి ఉండవచ్చునని ప్రచారం సాగుతోంది. తప్పులు లేకుండా రైతులు ఇబ్బంది పడకుండా మార్పులు చేస్తున్నారా? అంటే యంత్రాంగం అవుననే సమాధానం చెబుతోంది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వీటిని రెండు విడతలుగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా తేదీలు ఖరారు చేయకపోవడంతోనే వీటిని పంపిణీ చేయలేదని కలెక్టరేట్ వర్గాలు చెబుతున్నాయి.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

» ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

పోలీసు త్యాగాలు మరువలేనివి

» రేపు జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవం

■ లోపలి పేజీలో..

స్క్రాప్‌గా.. ఈ- ఆటోలు!



» సంపద కేంద్రాలకు చెత్త తరలింపునకు కొనుగోలు
» ఒక్కొక్కదానికి రూ.ఐదు లక్షల వ్యయం
» పక్కన పెట్టిన గత వైసీపీ ప్రభుత్వం
» ఉపయోగంలోకి రాకుండానే వాహనాలు నిర్వీర్యం

(నూజివీడు టౌన్-ఆంధ్రజ్యోతి)

చెత్త నుంచి సంపద సృష్టించాలన్న లక్ష్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలోనూ చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఊరి బయట షెడ్లు నిర్మించి గ్రామంలో ఉత్పన్నమయ్యే తడి,పొడి చెత్తలను చెత్తసంపద కేంద్రాలకు తరలించి తద్వారా వర్మి కంపోస్టును తయారుచేసి పంట పొలాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయలను వెచ్చించింది. షెడ్ల నిర్మాణంతో పాటు ప్రతి గ్రామానికి చెత్తను తరలించేందుకు ఎలక్ట్రిక్ ఆటోలను పంచాయతీరాజ్‌శాఖ కొనుగోలుచేసి ఆయా గ్రామాలకు అందించింది. అయితే ఆ కార్యక్రమం పట్టాలు ఎక్కక ముందే ప్రభుత్వం మారింది. గత వైసీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పక్కన పెట్టింది. దీంతో ఈ- ఆటోలు మూలకు చేరి పనికిరాకుండా పోయాయి.

ఒక్కొక్క ఈ-ఆటో కొనుగోలుకు సుమారు రూ.ఐదు లక్షలకు పైబడి వెచ్చించారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఉన్న 84 గ్రామాలకు గాను 62 గ్రామాలకు ఈ-ఆటోలను సరఫరా చేశారు. తడిచెత్త, పొడిచెత్తలను వేర్వేరుగా సమీకరించి చెత్తసంపద కేంద్రాలకు తరలించాల్సిన బాధ్యత ఈ-ఆటో నిర్వాహకులది. సుమారు మూడున్నర కోట్ల రూపాయల వరకు ఖర్చు అవ్వగా తదనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం ఈ-ఆటోలను పట్టించుకోకుండా పక్కన పెట్టేసింది. మరోవైపు తడి చెత్త పొడి చెత్తను గ్రామం నుంచి తరలించేందుకు రూ.16 లక్షలు ఖర్చు చేసి రిక్షాలను కొనుగోలు చేశారు. వాస్తవంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా ఈ-ఆటో లనే వినియోగంలోకి తీసుకొని వచ్చిఉంటే సంపద తయారీకేంద్రాలను ఎప్పుడో గాడిలో పెట్టి సంపద సృష్టించేందుకు అవకాశం కలిగేది. చెత్త సంపద కేంద్రాలకు ఉపయోగపడాల్సిన ఈ-ఆటోలు పూర్తిగా శిథిలమై చెత్తగా మారుతున్నా (స్క్రాప్) ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వాటికి పనికివచ్చే ఆటోలను కాస్తా మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని, పనికిరాని వాటిని వేలం వేయడం ద్వారా ప్రజా ధనాన్ని దుర్వి నియోగం కాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

అల్పపీడనం.. జోరువాన

ఏలూరుసిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో శనివారం రాత్రి 11 గంటలకు ప్రారంభమైన వర్షాలు ఆదివారం మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా కురుస్తూనే ఉన్నాయి. ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పోలవరం మండలంలో 104.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 48.9 మి.మీ నమోదైంది. ముదినేపల్లి 101.2, బుట్టాయిగూడెం 85.6, జంగారెడ్డిగూడెం 80.4, నిడమర్రు 80.2, కొయ్యలగూడెం 79.8, ద్వారకాతిరుమల 73, మండవల్లి 71.8, కైకలూరు 62.2, దెందులూరు 59, కలిదిండి 53.8, కామవరపుకోట 51.8, భీమడోలు 49.4, లింగపాలెం 47.2, ఏలూరు అర్బన్ 45.6, ఉంగుటూరు 42, వేలేరుపాడు 41, ఏలూరు రూరల్ 39.2, పెదపాడు 38.4, ఆగిరిపల్లి 35.6, టి.నరసాపురం 35.2, ముసునూరు 22.8, జీలుగుమిల్లి 21.4, చింతలపూడి 15.6, కుక్కునూరు 10.4, చాట్రాయి 9.2, నూజివీడు 7.8, పెదవేగి 4.6 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

పోలవరం : పోలవరం పంచాయతీలో పల్లపు ప్రాంతాలైన బెస్తావీధి, బాపూజీ కాలనీ, కొత్తపేట, యడ్లగూడెం ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టిసీమలో వీరభద్రపురం, కొత్తపట్టిసీమలో దుర్గమ్మ గుడి ప్రాంతంలో ఏటిగట్టు దిగువన నివాసాలు జలమయమయ్యాయి. గుంజవరం, కడమ్మ కాలువ, కొవ్వాడ కొండవాగులు కడెమ్మ స్లూయిజ్, పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నుంచి గోదావరిలోకి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ఏలూరు టూటౌన్ : విలీన గ్రామాలైన తంగెళ్లమూడి, శని వారపుపేట, సత్రంపాడు, వెంకటా పురంలో పలు కాలనీల్లోకి వర్షపునీరు చేరింది. ఖాళీస్థలాలు నిండిపోయాయి. ఏలూరు నగరంలో పత్తేబాద, అశోక్‌నగర్, పవర్‌పేట, వన్‌టౌన్ ప్రాంతా ల్లో రోడ్ల పైకి వర్షపునీరు చేరింది. వంగాయిగూడెం సెంటర్ లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్లు చెరువులను తలపిస్తున్నా యి. తంగెళ్లమూడి లక్ష్మీనగర్‌లో ఖాళీస్థలాల్లోకి నీరు చేరింది.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. చెరువులు పొంగి పొర్లాయి. కొయ్యల


ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిలిచిన వర్షపునీరు

గూడెం-దిప్పకాయలపాడు గ్రామాల మధ్య రహదారిపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్లు కొట్టుకుపోయాయి. కొయ్యలగూడెం అపోలో స్కూల్ వద్ద, కొయ్యలగూడెం వద్ద రోడ్లు కొట్టుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారు. పొగాకు తోటలు వేయడానికి దుక్కులు దున్నుకుని సిద్ధం చేసుకున్న రైతులకు అకాలవర్షం నిరాశ మిగిల్చింది.

ఎర్రకాలువ జలాశయానికి పోటెత్తిన వరదనీరు

జంగారెడ్డిగూడెం: కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణ మూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వరద నీరు పోటెత్తుతోంది. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ఆదివారం మధ్యాహ్నానికి 82.80 మీటర్లకు చేరుకుంది. జలాశయంలోకి 2,274 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా 2,274 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు ఇరిగేషన్ డిఈ.సునీత తెలిపారు. ఆదివారం డిఈ.సునీత జలాశయాన్ని సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఈ సునీత


ఏలూరులో చెరువులా మారిన రోడ్డు

శ్రీవారి ఆలయంలో సాయంకాలార్చన సమయం మార్పు



ద్వారకాతిరుమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాస్త మయ కాలాన్ని అను సరించి చినవెంకన్న ఆలయంలో సాయం కాలార్చన సమయాన్ని మార్పు చేసినట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారా యణమూర్తి తెలిపారు. ఈనెల 23 నుంచి సాయంకాలార్చనను సాయంత్రం 5గంటల నుంచి సా. 6.30 వరకు మార్పు చేశామన్నారు. ఇప్పటివరకు ఈ సమయం సా.5.30 నుంచి సా. 7గంటల వరకు ఉండేదని వివరించారు. స్వామి వారి దర్శనం ఈనెల 23 నుంచి సాయంత్రం వేళలో ప్రతీ రోజూ 5గంటల వరకు ఆ తర్వాత 6.30 గంటల నుంచి లభిస్తుందని ఈ మార్పును భక్తులు గమనించాలని కోరారు.

120 మంది ప్రైవేటు విద్యాసంస్థల టీచర్లకు పురస్కారాలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం(అపుస్మా) జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక డీసీఎంఎస్ ఫంక్షన్‌హాలులో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. వాస్తవానికి ఈ కార్యక్రమం ఈనెల 5న ఇంటర్నేషనల్ టీచర్స్ డే సందర్భంగా జరగాల్సిఉండగా, ఆ రోజున భారీ వర్షాల కారణంగా వాయిదావేసి ఆదివారం నిర్వహించారు. అపుస్మా జిల్లాశాఖకు అనుబంధంగా ఏలూరు, బుట్టాయగూడెం, పోలవరం, జంగారెడ్డిగూడెం, దెందులూరు, ఉంగుటూరు జోన్లు ఉన్నాయి. ఈ జోన్లలో ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 120 మందిని ఎంపిక చేసి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపైనే ఉంటుందన్నారు. అవార్డులు అందుకున్నవారిని మిగతా టీచర్లు ఆదర్శంగా తీసుకుని వచ్చే ఏడాది పురస్కారాలు పొందేలా బోధనా పటిమను మెరుగుపర్చుకోవాలని సూచించారు. అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు కె.తులసీ విష్ణుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సమానంగా ప్రైవేటు బడ్జెట్ స్కూల్స్ కృషి చేస్తుండడం అభినందనీయ మన్నారు. డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, అపుస్మా రాష్ట్ర సహ అధ్యక్షుడు జంగా బాలాజీ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంబీఎస్ శర్మ, జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శివకుమార్ శర్మ, ఎస్‌ఆర్‌కేఏ ప్రసాద్, కోశాధికారి రామకృష్ణ, జోన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యనిర్వాహక సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఉత్తమ టీచర్లుగా ఎంపికైనవారిని శాలువా, ప్రశంసాపత్రం, జ్ఞాపికలతో సన్మానించారు.


ఉత్తమ టీచర్లుగా పురస్కారాలు అందుకున్నవారితో అపుస్మా రాష్ట్ర, జిల్లాశాఖల నాయకులు



దివ్వి దివ్వి దీపావళి.. ఆనంద రవళి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పండుగ సందడి

- వర్షం దెబ్బతో బాణసంచా దుకాణదారుల డీలా
- వినియోగదారులకు తప్పని ధరాఘాతం

ఏలూరుసిటీ/ఏలూరు రూరల్/భీమవరం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సోమవారం దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవడానికి ప్రజలు సన్నద్ధమవుతున్నారు. పలు కార్పొరేట్ మాల్స్, వ్యాపార, వాణిజ్య సంస్థల వారు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి తమ దుకాణాలకు విద్యుద్దీపాలంకరణలు చేశారు. ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా వర్షాలు కురియడం, అల్పపీడనం ప్రభావంతో సోమవారం వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేయడంతో పండుగపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వర్షాలు కురియడంతో బాణసంచా అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

బాణసంచా ధరల మంట

దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక లైసెన్సులు తీసుకుని ఉమ్మడి పశ్చిమ జిల్లాలో బాణసంచా అమ్మకాలను నిర్వహిస్తున్నారు. బాణసంచా కొనుగోలులో ధరల భారం తప్పడం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. బ్రాండెడ్ పేరుతో ఎంఆర్‌పీ ధరపై 75 నుంచి 80 శాతం డిస్కౌంట్‌లు ఇస్తున్నామని చెబుతున్నా అవి కూడా గతేడాదితో పోలిస్తే ఎక్కువగానే ఉన్నాయని చెబుతున్నారు. బాణసంచాలో రకరకాల ఫ్యాన్సీ ఐటమ్స్ మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి.

మట్టి ప్రమిదలకు తగ్గిన గిరాకీ

విజయానికి చిహ్నంగా జరుపుకునే దీపావళి పండుగ రోజున మట్టితో చేసిన ప్రమిదల్లో దీపాలు వెలిగించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. వెరైటీ ప్రమిదలు మార్కెట్‌లో లభిస్తుండగా, ఆన్‌లైన్‌లో నీళ్లలో వెలుగులు నింపే ప్రమిదలు లభిస్తున్నాయి. కాలక్రమంలో లోహంతో చేసిన దీపాలు, కొవ్వొత్తుల వినియోగం, విద్యుత్ దీపాలంకరణలు పెరగడంతో మట్టి ప్రమిదలకు గిరాకీ తగ్గిందని నిర్వాహకులు తెలిపారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో దీపావళి పండుగకు 15 రోజుల ముందు నుంచే టపాసులు మోత మోగేది. ప్రస్తుతం ఆ సందడే కానరావడం లేదు. బాణసంచా ధరలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ధరలు రెండు రెట్లు పెరిగాయని చెబుతున్నారు.



తణుకులో అమ్మకాలు



ఏలూరులో..



ముదినేపల్లిలో..



ఇండోర్ స్టేడియంలో వర్షానికి చిత్తడిగా మారిన ప్రాంతం



మోటారుతో నీటిని తోడుతున్న దృశ్యం

బాణాసంచా దుకాణాలు వెలవెల

నీట మునిగిన షాపులు

దీపావళి పండుగపై వర్షం ఎఫెక్ట్ పడింది.శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వర్షం కురవడంతో బాణసంచా దుకాణాలు నీట మునిగాయి. ఏలూరు ఇండోర్ స్టేడియంలో మోకాళ్లలోతు నీరు నిలిచి దుకాణాలు నీటి మునిగాయి. జంగారెడ్డిగూడెం, భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, నరసాపురం పట్టణాల్లో వ్యాపారులు మాట్లాడుతూ వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, అమ్మకాలు లేకపోవడంతో ఏం చేయాలో తెలియడం లేదని వాపోతున్నారు. ఆదివారం కొనుగోలుదారుల కోసం దుకాణాదారులు నిరీక్షిస్తున్నారు. ఏలూరులో మోటార్లు పెట్టి స్టేడియంలో నిలిచిన వర్షంనీటిని బయటకు తోడారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. ప్రజలందరూ ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలి. ప్రజలందరి జీవితాల్లో వెలుగులు, సంతోషాలు నిండాలి.

- కొలుసు పార్థసారథి, రాష్ట్ర హౌసింగ్ మంత్రి

పండుగ సంతోషంగా జరుపుకోవాలి

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి పండుగ శుభాకాం క్షలు. దుష్టశక్తులపై దైవశక్తి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి. ప్రజలంతా సంతోషంగా పండుగ జరుపుకోవాలి.

- ఎంపీ పుట్టా మహేశ్, ఎంపీ

దీపావళి ఆనందమయం కావాలి

చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి పండుగ ప్రతీకని.. ఈ దీపావళి ప్రజలకు ఆనందమయం కావాలి. ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వేళలో బాణాసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకుని, పర్యావరణ హితంగా టపాసులు వినియోగించాలి.

- వెట్రిసెల్వి, కలెక్టర్, ఏలూరు జిల్లా

విజయానికి ప్రతీక దీపావళి

దీప కాంతులతో శోభాయ మానంగా... సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకొనే పండగ దీపావళి. తెలుగు ప్రజలందరికీ హృదయ పూర్వక దీపావళి శుభాకాంక్షలు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని నిర్వహించుకుంటాం. దీపావళిని పర్యావరణహితంగా చేసుకుందాం.

- నాగరాణి, కలెక్టర్, పశ్చిమ జిల్లా

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

దీపావళి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకని ఇది ప్రజలందరి జీవితాల్లో వెలుగులు, సంతోషాలు నింపాలి. జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు పండుగను ఆనందంగా, సురక్షితంగా ప్రజలందరూ జరుపుకోవాలి. పర్యావరణానికి హానిలేని టపాసులను మాత్రమే ప్రజల కాల్చాలి

- కేపీఎస్ కిశోర్, ఎస్పీ, ఏలూరు జిల్లా

22 నుంచి కార్తీక మాసం ప్రారంభం

భీమవరంటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన కార్తీక మాసం ఈసారి దీపావళి అమావాస్య తరువాత రోజు నుంచి కాకుండా ఆ మరుసటి రోజు నుంచి ప్రారంభం అవుతోంది. దీని కారణంగా సోమవారం రాత్రి అమావాస్య ఉండడంతో అదే రోజు దీపావళి జరుపుకుంటున్నారు. మరుసటి రోజు మంగళవారం మధ్యాహ్నం వరకు అమావాస్య ఉండడంతో కార్తీక మాసం బుధవారం ప్రారంభం కానుంది. అమావాస్య తర్పణాలు మాత్రం మంగళవారం ఇవ్వాలని పండితులు తెలుపుతున్నారు. అయితే కొన్ని దేవాలయాల్లో పాడ్యమి కార్తీక ఆకాశ దీపాలు మంగళవారం సాయంత్రం నుంచి వెలిగిస్తారని చెబుతున్నారు. కార్తీకమాసం ప్రారంభం పాడ్యమి స్నానాలు బుధవారం తెల్లవారు జామునుంచే ప్రారంభం అవుతాయని చెబుతున్నారు. బుధవారం నుంచి నెలరోజుల పాటు శివాలయాలు శివనామస్మరణతో మార్మోగనున్నాయి.





శ్రీవారి ఆలయంలో నామమాత్రంగా భక్తుల సంచారం.. శివయ్యకు రుద్రాభిషేకం


ఓం నమో వేంకటేశాయ !

- శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం సాధారణ భక్తుల రద్దీ నెలకొంది. దీపావళి పర్వదినం ముందురోజులు కావడంతో ఆలయానికి దాదాపు పది వేల మంది భక్తులు మాత్రమే వచ్చినట్లు అధికారుల అంచనా. అందరికీ సెలవు రోజు కావడంతో ఈ మాత్రం భక్తుల సంచారం ఆలయంలో కనిపించింది ఈ క్రమంలో యాత్రికులు క్షేత్రానికి చేరుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి గంట వరకు సమయం పట్టింది. దర్శనానంతరం శ్రీవకుళమాత అన్నప్రసాద భవనంలో ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నేత్రపర్వం.. ఏకాదశ రుద్రాభిషేకం

క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం భక్తులను తన్మయం చేసింది. లోకకల్యాణార్థం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ సేవ భక్తులకు కనువిందు చేసింది. ఆలయ గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు పండితులు వేదమంత్రోచ్చరణల నడుమ రుద్రాభిషేకాన్ని జరిపారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.



గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

బుట్టాయగూడెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మన్యంలో వేంచేసిన గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుంచే అమ్మవారి దర్శనానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. శనివారం రాత్రి నుంచి వర్షం కురిసినా ఆదివారం వాతావరణం పొడిగా ఉండడంతో దర్శనా లకు ఎటువంటి అటంకాలు కలగలేదు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ప్లాస్టిక్ వస్తువులతో నిండిపోవడంతో కమిటీవారు 10 నుంచి 15 మంది కూలీలతో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారు. గతంతో పోలిస్తే భక్తులు ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గిస్తున్నట్టు కమిటీవారు తెలియజేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఆకివీడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రొయ్యల చెరువు మీద పనిచేస్తున్న కార్మికుడు విద్యుదాఘాతంతో చనిపోయిన ఘటన ఆకివీడులో జరిగింది. ఎస్‌ఐ హనుమంతు నాగరాజు తెలిపిన వివరాలివి.. అల్లూరి సీతారామరాజు జిల్లా, జమ్ములమడుగు మండలం, బొంతిలి గ్రామానికి చెందిన భూటారి సంజీవరావు(45) మందపాడు శివారు ఉప్పరగూడెంలో ఓ రొయ్యల చెరువుపై మకాం ఉంటూ పనిచేస్తున్నాడు. ఆదివారం కరెంట్ షాక్ కొట్టి చనిపోవడంతో మృతుడి వరుసకు తమ్ముడైన దేవప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.





దేవరపల్లిలో అభినందన సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు.. నూతనంగా ఉపాధ్యాయులుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- దేవరపల్లిలో ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం

దేవరపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, తలిదండ్రులు జన్మనిస్తే వారికి జీవితాన్ని ఇచ్చేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి కరుటూరి ఫంక్షన్ హాలులో ఆదివారం 2025లో డీఎస్సీలో నాలుగు మండలాల్లో ఉన్న 95 మంది ఉపాధ్యాయులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నూతన వస్త్రాల కిట్‌లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తుందని దానికి అనుగుణంగా ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలతో విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 15,491 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విద్యార్థులు విద్యతో పాటు ఆట, పాట వివిధ కళలను విద్యా ర్థుల్లో కలిగించే సృజనాత్మకశక్తిని పెంపొం దించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విశాఖపట్నంలో గూగుల్ హబ్ తీసుకు రావ డంతో మన ఆంధ్రప్రదేశ్‌కే ఎంతో గర్వకా రణం అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి కూటమి ప్రభు త్వం, మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషిచేశారని అన్నారు. ఇటీవల నిరుద్యోగు లకు విద్యామేళా ద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, టీడీపీ నాయకులు కొయ్యలమూడి చినబాబు, సుధారాణి, ముళ్లపూడి దొరాజీచౌదరి, సొసైటీ చైర్‌పర్సన్‌లు ఉప్పులూరి రామారావు, దేవరపల్లి సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు, నాలుగు మండలాల ఎంఈవోలు తిరుమలదాసు, అప్పారావు, శ్రీనివాసరావు, మహేశ్వరరావు, సత్యనారాయణ, వెంకట్రావు, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





ఏలూరు హేలాపురి ఉత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే.. భీమవరం సభలో మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల కొనుగోలు శక్తి పెంపు

- ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి
- హేలాపురి ఉత్సవం - పండుగ వాతావరణంలో షాపింగ్ ఫెస్టివల్

ఏలూరుసిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం రాత్రి జరిగిన 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్'లో భాగంగా నిర్వహిస్తున్న 'హేలాపురి ఉత్సవం. షాపింగ్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. జిఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు నెలకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఆదా అవుతుందన్నారు. జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రతీ కుటుంబానికి మరింత అవగాహన కలిగించేందుకు నెల రోజుల నుంచి పలు అంశాలుపై గ్రామ/వార్డు సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో పండుగ వాతావరణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పాత జీఎస్టీ వసూలు చేసే వ్యాపారస్తులపై ఫిర్యాదు చేస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు సామాన్యులకు ఒక వరమని, ప్రజల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చాయన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా 8వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నప్పటికీ పేదవారికి అన్ని వస్తువుల ధరలు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ రేట్లను తగ్గించాయన్నారు.

ఈ సందర్భంగా 'హేలాపురి ఉత్సవం.. షాపింగ్ ఫెస్టివల్‌లో 500 రూపాయలు అంతకుమించి కొనుగోలు చేసిన వినియోగదారుల పేర్లను లక్కీడ్రా తీసి ముగ్గురు విజేతలకు మొదటి బహుమతిగా బైక్, రెండో బహుమతిగా ఎయిర్ కండీషనర్, మూడో బహుమతిగా ఎల్‌ఈడీ టీవీలను కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు అందజేశారు. షాపింగ్ ఫెస్టివల్ నిర్వహణకు సహకారం అందించిన దాతలు నవభారత్ లిమిటెడ్, గోద్రేజ్ అగ్రోవేట్ లిమిటెడ్, గోర్మెట్ పాప్ కార్నికా కంపెనీ, విన్నర్ సెరామిక్స్ లిమిటెడ్ యాజమాన్యాలను కలెక్టర్ వెట్రిసెల్వి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి, కార్యక్రమంలో డీఆర్‌వో వి.విశ్వేశ్వరరావు, వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జునరావు, జిల్లా పరిషత్ సీఈవో ఎం.శ్రీహరితో పాటు అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలు ఒక వరం : పితాని

భీమవరంటౌన్ : జీఎస్టీ సంస్కరణలు అన్ని వర్గాల ప్రజలకు ఒక వరం వంటిదని, పశ్చిమ గోదావరి జిల్లాలో సూపర్ జీఎస్టీ. సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాలు, నిర్వహణ భేష్‌గా ఉన్నాయని, కొద్దికాలం తరచుగా జీఎస్టీ తనిఖీలు నిర్వహించాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. జీఎస్టీ ముగింపు ఉత్సవాలు ఆదివారం రాత్రి భీమవరం కాస్మోపాలిటిన్ క్లబ్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చాయన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు మనం జిల్లాస్థాయి షాపింగ్ ఫెస్టివల్‌తో పాటు దీపావళి సెలబ్రేషన్ జరుపుకుంటున్నామన్నారు. రాష్ట్ర మహిళా ఆర్థిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పీతల సుజాత, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం, వెస్ట్రన్ డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. భీమవరం జేఎల్ బి.మున్సిపల్ బాలికల పాఠశాల విద్యార్థుల ప్రదర్శించిన గణనాయక ప్రదర్శన, తణుకు రూట్స్ పాఠశాల విద్యార్థుల ప్రదర్శించిన నవ దుర్గా థీమ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. భీమవరం పీఎస్‌ఎం బాలికల పాఠశాల విద్యార్థులు జీఎస్టీ తగ్గింపుపై చేసిన లఘునాటిక ఆకట్టుకున్నది. భవన నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ వలవల బాబ్జి, కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంట త్రిమూర్తులు, టైలర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు స్వామి, డీఆర్‌వో బి.శివన్నారాయణ రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శైలజశ్రీ, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొననున్నారు.



భీమవరంలో నరకాసుర వధ నృత్యరూపకం

పోలీసు త్యాగాలు మరువలేనివి

అక్టోబరు 21న జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవం

ఏలూరు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రేయనక, పగలనక, ఎండనక వాననక 24 గంటలు అహర్నిశలు విధి నిర్వహణలోనే ఉండాలి. పోలీస్ ఉద్యోగం అంటే 24 గంటలు విధుల్లో ఉండాల్సిందే. తమ ఇళ్లల్లోనూ, బంధువుల ఇళ్లల్లోనూ జరిగే శుభ, అశుభ కార్యాలకు వెళ్లే అవకాశాలు లేకుండా విధుల్లో ఉండాల్సిన పరిస్థితులు ఎన్నో ఎదురవుతూనే ఉంటాయి. తాము అంకిత భావంతో పోలీసు ఉద్యోగానికి వచ్చామన్న మాటను వారు గుర్తు చేసుకుంటూ ఏ మాత్రం అధైర్యపడకుండా వృత్తి ధర్మం మేరకు ప్రజలకు సేవలు అందిస్తూ సమాజంలో శాంతి భద్రతలను కాపాడుతున్నారు. ఈనెల 21న జాతీయ పోలీసు అమర వీరుల దినోత్సవం పురస్కరించుకుని పోలీసుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ ప్రత్యేక కథనం.

తాడేపల్లిగూడెంలోని పోస్టాఫీస్‌లో దొంగలు పడ్డ సమయంలో అడ్డుకున్న నైట్‌బీట్ కానిస్టేబుల్ వేణుగోపాలరావును దొంగలు ఇనుపరాడ్డుతో తలపై మోదడంతో తీవ్ర గాయాలకు గురై కొంత కాలం కోమాలోకి వెళ్లి కోలుకోలేక స్వగ్రామమైన ఏలూరులోని తన నివాసంలో మృత్యువాత పడ్డాడు. రెండేళ్ల క్రితం నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని ఆగిరిపల్లికి చెందిన కానిస్టేబుల్ గంధం నరేంద్ర వినాయకచవితి ఉత్సవాల్లో అర్ధరాత్రి సమయం మించిందని డీజే సౌండ్లను ఆపివేయాలని కోరడంతో అతనిపై మద్యం మత్తులో ఉన్న కొంతమంది దాడి చేయడంతో ఆ కానిస్టేబుల్ మృత్యువాత పడ్డాడు. విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదాల్లో మరణించిన పోలీస్ సిబ్బంది ఉన్నారు. వీరంతా ప్రజల సేవకు అంకితమై తన స్వార్థాన్ని పక్కన పెట్టి ధైర్యసాహసాలతో వీరోచితంగా వృత్తి ధర్మం కోసం పోరాడిన పోలీసులుగా కీర్తిగడించారు.

అమరవీరుల దినోత్సవం ఈ విధంగా..

1959 అక్టోబరు 21న చైనా-భారత్ సరిహద్దుల్లో లడక్‌లోని హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతంలో భారత్ సరిహద్దు భద్రతా బలగాలపై అక్టోబరు 21వ తేదీన చైనా సైనికులు ఆకస్మిక దాడికి పాల్పడ్డారు. ఈఘటనలో 11 మంది భారత జవాన్లు వీరమరణం పొందారు. వారి త్యాగాలను గుర్తించి తదుపరి కాలంలో దేశవ్యాప్తంగా విధిలో ప్రాణాలు విడిచిన పోలీసులందరికి నివాళి అర్పించేందుకు ఈ ఘటనను పురస్కరించుకుని అక్టోబరు 21న జాతీయ పోలీసు అమరవీరుల దినోత్సవంగా ప్రకటిం చారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా పోలీసు సిబ్బంది త్యాగాలను గుర్తు చేసుకుంటూ జరిపే దినోత్సవమే పోలీసు అమరవీరుల దినోత్సవంగా కొనసాగిస్తున్నారు. ప్రతి ఏడాది అక్టోబరు 21 నుంచి 31 వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

సంక్షేమానికి పెద్దపీట : కిశోర్, ఎస్పీ ఏలూరు జిల్లా



జిల్లాలో పోలీస్ సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ ఉన్నవారితో శాంతి, భద్రతలు కాపాడడం, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఏఐ టెక్నాలజీ వినియోగించి సిబ్బందికి పనిఒత్తిడి తగ్గించాం. పగలు, రాత్రి వేళ గస్తీ పోలీసులు అన్ని ప్రాంతాలకు వెళ్లే పరిస్థితులు తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో డ్రోన్లను వినియోగించి అన్ని ప్రాంతాలపై నిఘా పెంచాం. ఓపెన్ హౌస్‌లు, వ్యాస రచనపోటీలు, కళాజాత, సైకిల్ ర్యాలీలు వంటి వివిధ కార్యక్రమాలు చేసి పోలీసులు చేస్తున్న సేవలను ప్రజలకు వివరిస్తున్నాం.



దివ్యశ్రీకి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్

రాష్ట్ర స్థాయి సెమినార్ పోటీల్లో జిల్లా విద్యార్థిని ప్రతిభ

ఏలూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెమినార్ పోటీల్లో ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు టెన్త్ విద్యార్థిని వై.దివ్యశ్రీ తృతీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్ కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు ఓ ప్రకటనలో వివరాలు తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఇంత వరకు ప్రముఖంగా ఉండే బెంగళూరు, హైదరాబాద్‌తో పోటీపడేలా నవ్యాంధ్ర వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖకు గూగుల్ సెంటర్ రాకతో సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని, దీనిపై విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పించడం ద్వారా, వారిని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. ఈ మేరకు అవగాహన కల్పించడం కోసమే ఎస్సీఈఆర్టీ రాష్ట్ర వ్యాప్తంగా సెమినార్లు నిర్వహిస్తోందన్నారు. ప్రపంచ సాఫ్ట్‌వేర్ చిత్రపటంలో ఇక మీదట ఏపీ ప్రముఖ స్థానంలో ఉంటుందని వివరించారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెమినార్‌లో జిల్లా తరపున పాల్గొన్న దివ్యశ్రీ క్వాంటం సాంకేతికతకు సంబంధించి విషయాలను అనర్గళంగా వివరించి తృతీయ స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విజేత దివ్యశ్రీకి, ప్రోత్సహించిన గైడ్ టీచరు రవి కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులుకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, స్టేట్ నోడల్ ఆఫీసర్ నాగమణి బహుమతి అందజేశారు.

ఘనంగా హథీరామ్ బర్సి ఉత్సవం

ఏలూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దొండపాడులో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం, బంజారా భజరంగీ భేరి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హథీరామ్ మహాభోగ్ కార్యక్రమాన్ని ధరావత్తు చోక్లా నాయక్ అన్నపూర్ణ దంపతుల చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. ఆలిండియా బంజారా సేవా సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు బాణావతు మోహనరావు నాయక్ మాట్లాడుతూ బంజారాల ఆధ్యాత్మిక మార్గదర్శి హథీరామ్ ఏడుకొండలపైన జీవ సమాధి అయిన త్యాగదినాన్ని బర్సి ఉత్సవంగా జరుపుకుంటూ దేశ వ్యాప్తంగా అన్నీ తండాల్లో మహాభోగ్ కార్యక్రమం చేయడం బంజారాల సంప్రదాయమన్నారు. ఏబీఎస్ఎస్ సంఘ జిల్లా నాయకులు భూక్యా రమేశ్ నాయక్ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామికి బాలాజీ అని నామకరణ చేయడమే కాకుండా అతనితో పాచికలాడి దైవాన్నే ఓడించిన మహా భక్తుడు హథిరామ్ అని కొనియాడారు. బంజారా భజరంగీ భేరి సంఘ జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ హథిరామ్ మఠంలో గోర్ బంజారాల వారసత్వ హక్కులను తిరిగి కనిపించాలని, హథిరామ్ మఠం పాలక మండలి నిర్వహణా బాధ్యతలు గోర్ బంజరాలకు అప్పజెప్పాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు ధరవతు శ్రీనివాస్ రావు నాయక్, వడిత్యా రమేశ్, గుగ్గులోతు రమేశ్, లావుడియా కృష్ణ కిషోర్, దారావతు హనుమంతు నాయక్, భూక్యా జ్యోతి, బాణావతు దేవి, బోడల ప్రమీల, దారావతు అరుణ పాల్గొన్నారు.


బర్సి ఉత్సవంలో పాల్గొన్న నాయకులు, మహిళలు


దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

పేదల ఆరోగ్యానికి భరోసా : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ద్వారా పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భద్రత కల్పిస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న 33మంది రూ.17 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామన్నారు. విభిన్న ప్రతి భావంతులకు ట్రైసైకిళ్లు, చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందించామన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని బడేటి చంటి సొంత నిధులతో ఆర్థిక సహాయం చేశారు. ఇప్పటి వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీల ద్వారా 3కోట్ల 50లక్షల ఆర్థిక సహాయం పేదలకు అందించామన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, పార్టీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, బి.కిషోర్ పాల్గొన్నారు.

83 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణం వెనుకవైపు ఉన్న పాత శివాలయం హాల్లో లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం వేమగిరికి చెందిన యోగానంద నేత్ర వైద్యశాల నిపుణుల బృందం 83 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణలో సలహాలు, సూచనలిచ్చారు. 18 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి వారికి సబ్సిడీపై కళ్లజోళ్ళు అందించారు. ఎనిమిది మంది వృద్ధుల కళ్ళల్లో శుక్లాలు ఉన్నట్టు గుర్తించి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు వైద్య బృందం వేమగిరికి వారి వాహనంలోనే తీసుకెళ్లారు. ఈ శిబిరంలో స్థానికులు బొలిశెట్టి సురేష్ కుమార్, పిల్లి పండరీనాథ్, తవ్వా అజయ్‌కుమార్, లోకేష్ బృందం శిబిరంలో సేవలందించారు.


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు



దీపావళి సంతోషంగా జరుపుకునేలా చర్యలు

కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా భద్రత మధ్య ఆనందంగా దీపావళిని జరుపుకునేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆదివారం జిల్లాలో బాణసంచా ప్రమాదాల నివారణపై ఎస్పీ కేపీఎస్ ప్రతాప్ శివ కిషోర్‌తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులతో టెలికాన్ఫరెన్సులో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దీపావళి సమయంలో జిల్లాలో ఎక్కడా బాణసంచా ప్రమాదాలు సంభవించకుండా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు దుకాణాల వద్ద సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో లైసెన్సు కలిగిన బాణసంచా తయారీ, నిల్వ, అమ్మకాల షాపుల వద్ద విద్యుత్, షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాల సమయంలో మంటలను ఆర్పేందుకు ఉపయోగించే పరికరాలు తప్పనిసరిగా ఉండేలా అధికారులు తనిఖీ చేయాలని, భద్రత ఏర్పాట్లపై షాపుల యజమానులకు అవగాహన కలిగించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణకు జిల్లా కలెక్టరేట్‌లో 18002331077 టోల్ ఫ్రీ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, అదే విధంగా అన్ని రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాణసంచా దుకాణాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించ కుండా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్లను పరిశీలించాల న్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా జిల్లా స్థాయిలో 1912 టోల్ ఫ్రీ నెంబర్‌తో 94409 02926, 94409 04037, 94910 30712 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రమాద సమయంలో కంట్రోల్ రూమ్ సిబ్బందికి సమాచారం అందిస్తే వెంటనే సహాయక చర్యలు తీసుకుంటారన్నారు. బాణసంచా షాపుల వద్ద ప్రజలు గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా వల్ల కలిగే ప్రమాదాలు, నివారణా చర్యలపై ప్రజలకు అవగాహన కలిగిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు.


ఎస్పీతో సమీక్షిస్తున్న కలెక్టర్














ప్రత్యేక అలంకరణలో అమ్మవారు... సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా ధన త్రయోదశి వ్రతాలు, పూజలు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని దేవ దాయ శాఖ ఆధ్వర్యంలోని పాండురంగ స్వామి దేవాలయంలో ఆదివారం ధన త్రయోదశి పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు దండిబోట్ల కనకసుందర శర్మ, యాజ్ఞిక బృందం భక్తులతో సామూహికంగా వ్రతాలు, నోములు, అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ధనలక్ష్మీ అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి వేదికను ఏర్పాటు చేసి భక్తులతో పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకుని, భక్తి సంకీర్తనలు ఆలపించి, భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా భక్తులకు దేవాలయం ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తుల కు తగు ఏర్పాట్లు చేశారు.ధనలక్ష్మీ అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది.










తలకొండ జమలయ్యను అభినందిస్తున్న సంఘ నాయకులు

యాదవ సంఘ అధ్యక్షుడిగా జమలయ్య

దెందులూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం దెందులూరు నియోజకవర్గం అధ్యక్షునిగా బాపిరాజుగూడెం గ్రామానికి చెందిన తలకొండ జమలయ్య, ప్రధాన కార్యదర్శిగా పోతునూరుకు చెందిన నున్నా లక్ష్మణ్, గౌరవాధ్యక్షునిగా పెదపాడుకు చెందిన పంది వీరాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య తెలిపారు. ఏలూరులో ఆదివారం జరిగిన సమావేశంలో నియోజకవర్గం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చింతయ్య తెలిపారు. ఈ సందర్భంగా చింతయ్య మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి సంఘ పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. ఎన్నికైన వారిని సంఘ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెనుబోయిన మహేష్‌యాదవ్, యాదవసంఘం నాయకులు డొక్కు వెంకటేశ్వరరావు, ఇప్పిలి వెంకటేశ్వరరావు, పంది సూర్యచంద్రరావు, కాట్రు బాలు, పిల్లల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.















ఇస్కాన్ టెంపుల్ వద్ద ప్రత్యేక పూజలు

జీలుగుమిల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి ఇస్కాన్ టెంపుల్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞానకేంద్రం విద్యార్థులు ఉదయం ఆలయం వద్ద భగవద్గీత శ్లోకాలు పారాయణం, హరే కృష్ణ, హరేరామ నామాలతో 108 సార్లు జపం చేశారు. ఇస్కాన్ టెంపుల్ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరిగేలా ఆలయ నిర్వాహకులు స్థలదాతలు శ్రీమాలినీ మాతాజీ రాధాకృష్ణులకు పంచామృతాభిషేకాలు చేశారు. జీలుగుమిల్లి, తాటియాకుల గూడెం, పి.రాజవరం, వంకవారిగూడెం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు స్కూల్ గేమ్స్

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) డివిజన్ స్థాయిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల హెచ్‌ఎం పి.సోమశేఖర్ తెలిపారు.అండర్-14, అండర్-17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ పోటీల్లో ప్రతిభావంతులు జిల్లా స్థాయి పోటీలకు అర్హులన్నారు. డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని హెచ్‌ఎం సోమశేఖర్ కోరారు.

ఐటీడీఏకి అవార్డు పట్ల హర్షం

ఏలూరుటూటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం కె.ఆర్.పురం ఐటీడీఏ రాష్ట్రంలోనే ఉత్తమ ఐటీడీఏగా ప్రధాన మంత్రి జన్‌మన్ ఆదికర్మ యోగి అభయాన్ అవార్డు అందుకోవడం పట్ల ఎంపీ మహేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు విజయవంతానికి కృషి చేసినందుకు గానూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు, గ్రామ సభల నిర్వహణకు జాతీయ స్థాయిలో అవార్డు లభించడం జిల్లాకే గర్వకారణమన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు సమీపంలోని వట్లూరు నెహ్రూకాలనీకి చెందిన ముని దుర్గా ప్రసాద్ (49)కి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేయగా కుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. దుర్గా ప్రసాద్ కార్పెంటర్‌గా వృత్తి కొనసాగిస్తున్నాడు. కొంతకాలం నుంచి దుర్గా ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధను భరించలేక ఈ నెల 18వ తేదీ రాత్రి తన ఇంట్లో అందరూ పడుకున్న తరువాత తలుపులు వేసుకుని ఉరి వేసుకున్నాడు. ఆదివారం ఉదయం చూసేటప్పటికి తలుపు తీయడం లేదు. దీంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో తలుపులు తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మద్యం తాగనివ్వడం లేదని ఓ యువకుడు తీవ్ర మనస్థాపానికి గురై శనివారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతం నేరెళ్లరాజా కాలనీకి చెందిన గుడిపూడి చంద్రమౌళి(32)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. గత కొద్ది రోజులుగా మద్యం తాగనివ్వకుండా కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారు. దీంతో మనస్థాపానికి గురైన చంద్రమౌళి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతనిని ఉరి నుంచి దింపి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గుండుగొలనుకుంట శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. అలాగే వారి నుంచి 4 మోటార్ సైకిళ్లు, రూ.41,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్.ఐ. టి.సుధీర్ వివరించారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన

పెదవేగి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజల నమ్మకాలు, ఆశలు, ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రజలకు తొలుత దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభాకర్ మాట్లాడుతూ చీకటిని తరిమి, వెలుగులు నింపే పం డుగ దీపావళి అన్నారు. వైసీపీ చీకటి పాలనకు కూటమి ప్రభుత్వం చరమగీతం పాడి, పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లోకి వెలుగులు తీసుకొచ్చిందన్నారు. ఈడ్పుగంటి బాల సరస్వతికి రూ.50,205, కట్టా కృష్ణారావుకు రూ.32,100, మేడికొండ ఉషారాణికి రూ.1.10 లక్షలు, పామర్తి చంద్రావతికి రూ.31,500, తాతా పుణ్యవతికి రూ.32,500, పర్వతనేని ఉషారాణికి రూ.74,670 చెక్కులను అందించారు.

వివాహిత అదృశ్యం

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):సమయానికి నిద్ర లేచి ఇంటి పనులు చేయడం లేదని భర్త కుటుంబ సభ్యులు మందలించడంతో వివాహిత ఇంటి నుంచి అదృశ్యమైంది. ఏలూరు నగరంలోని తంగెళ్లమూడి రాణినగర్ ప్రాంతానికి చెందిన కసిరెడ్డి హర్షప్రియ(24)కు కసిరెడ్డి నాగడింభికేసుతో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఉదయం ఇంటి పనులు చేయకుండా నిద్రపోతూ ఉంటుందని భర్త మందలించాడు. ఇదే విషయాన్ని ప్రియతల్లి దండ్రులు కూడా ఆమెను మందలించారు. దీంతో శనివారం రాత్రి ఆమె తన కుమారుడిని తీసుకుని ఇంటి నుంచి అదృశ్యమైంది. పలు ప్రాంతాల్లో గాలించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

కుక్కునూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా గోదావరి వరద కుక్కునూరు మండలాన్ని చుట్టుముట్టడంతో వ్యవసాయ పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలకు ఉపాధి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వై.నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు కూలీల ఇబ్బందులను తెలియజేశారు.

తగ్గిన అమ్మకాలు

వ్యాపారులను కుంగదీసిన వర్షం
భద్రతను పర్యవేక్షించిన పోలీసులు



భీమడోలులో ఏర్పాటు చేసిన దుకాణాలు

భీమడోలు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా దీపావళి బాణసంచా అమ్మకాలు ఆదివారం అంతంత మాత్రంగా కొనసాగాయి. రెండు, మూడు రోజులకు ముందే దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులు, పండుగకు ఒక రోజు ముందు ఏర్పాటు చేసినప్పటికీ దుకాణాల ముందు దీపావళి సందడి కానరాలేదు. శనివారం అర్ధరాత్రి నుంచి వర్షం ప్రారంభం కావడం ఆదివారం కూడా వర్షం కొనసాగడంతో అమ్మకాలపై తీవ్ర ప్రభావం పడిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

నిబంధనలకు పాతర..

భీమడోలు మండల వ్యాప్తంగా ఎనిమిది తాత్కాలిక అనుమతులతో బాణసంచా దుకాణాలకు అధికారులు అనుమతులిచ్చారు. అయితే ఒక్క భీమడోలు గ్రామంలో ఒక్క ప్రదేశంలో ఆరు దుకాణాలు ఏర్పాటు చేశారు. అదే నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నివాసాల మధ్య గత ఐదేళ్లుగా ఈ ప్రాంతంలోనే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నామంటూ అధికారులు మాత్రం నిబంధనలను కప్పి పూడ్చుకుంటున్నారు. ఈ దుకాణాల ప్రాంతంలో అగ్నిమాపక నిబంధనలు కూడా పాటించకపోవడం కొసమెరుపు. భీమడోలులో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను భీమడోలు సీఐ విల్సన్ పరిశీలించి నిబంధనలు పాటించకపోతే దుకాణాలు తొలగిస్తామని హెచ్చరించారు.



పోలవరంలో భద్రతను పరిశీలిస్తున్న ఎస్ఐ పవన్

● పోలవరం: పోలవరం మండలంలో దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం బాణసంచా అమ్మకాలు జోరుగా కొనసాగాయి. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఉన్న దుకాణాలను పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి లైసెన్సులు, బాణసంచా అమ్మ కాల వద్ద భద్రతా ఏర్పాట్లు స్వయంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాపారులకు సూచించారు.

పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కుక్కునూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు కుక్కునూరు మండల కేంద్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం సీపీఐ మండల సమితి నాయకులు కోరింది. ఆదివారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య మాట్లాడుతూ సీసీఐ కేంద్రం లేకపోవడంతో పత్తిని ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఉంటుందని అధికారులు స్పందించాలన్నారు.







నియామకపత్రం అందుకుంటున్న దృశ్యం

ముస్లిం వేదిక జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఏలూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాఖ్య వేదిక ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ మహ్మద్ రసూల్, షేక్ ఆజాద్‌లు నియమితులయ్యారు.ఆదివారం మంగళగిరి ఈద్గా షాదిఖానాలో జరిగిన రాష్ట్ర సమాఖ్య ముస్లిం వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ముస్లిం సమాఖ్య వేదిక అధ్యక్షుడు సయ్యద్ సలా ఉద్దీన్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన రసూల్, ఆజాద్‌లు మాట్లాడుతూ జిల్లాలో ముస్లిం సమాఖ్య వేదికగా ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి హక్కుల కోసం కృషి చేస్తాం అన్నారు. రాష్ట్ర నూర్ పాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర నాయకులు సర్దార్, మునిఉల్లా, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గంపై దాడులకు వ్యతిరేకంగా పోరాటం

▸▸ సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ కార్మికులకు పిలుపు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలు హరించేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తు న్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్ టీయూ నాయకులు బి.సోమయ్య పిలుపునిచ్చారు. నవంబరు ఒకటి నుంచి నాలుగు రోజుల పాటు ఏలూరులో జరిగే ఇఫ్టూ రాష్ట్ర రాజకీయ తరగతుల నిమిత్తం ఆదివారం పలు కాలనీల్లో ప్రచార ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం పని గంటలు పెంచడం ద్వారా రాష్ట్ర ప్రభు త్వం కార్మిక వర్గంపై దాడి చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికవర్గం రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. ఇఫ్టూ నాయకులు యు.వి, బద్దా వెంకట్రావు, యర్రా శ్రీనివాసరావు, రమణ, చిన్నబ్బాయి, శ్రీను, రమేష్, అప్పారావు, వెంకటేశ్వరరావు, నెహ్రూబాబు, గంగరాజు, విజయ్, త్రినాథ్, దుర్గారావు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు



విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

ఏలూరుసిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణకు విద్యుత్ శాఖ తరపున జిల్లా, డివిజన్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ పి.సాల్మన్‌రాజు ఆదివారం తెలిపారు. జిల్లా స్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్ 1912తో పాటు 94409 02926 నెంబర్, ఏలూరు డివిజన్‌లో(94409 04037), జంగారెడ్డిగూడెం డివిజన్‌లో(94910 30712) కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ సరఫరా, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు సంభవిస్తే సహాయం కోసం 94408 12702, 94408 12703, 94408 12704, 94910 49797 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్ఈ తెలిపారు.



అయ్యప్ప, భవానీ భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

అప్పనవీడులో అయ్యప్పలకు అన్నదానం

పెదపాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప, భవానీ స్వాములకు అన్నదానం చేయడం దేవుడి సేవతో సమానమని ప్రముఖ పారిశ్రామికవేత్త, వీహెచ్‌పీ నేషనల్ ట్రస్టీ పుట్టగుంట సతీశ్ తెలిపారు. పెదపాడు మండలం అప్పనవీడు పంచాయతీ తాళ్ళమూడి అయ్యప్పస్వామి దేవాలయం వద్ద అభయాంజనేయస్వామి దేవాలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త, వీహెచ్‌పీ నేషనల్ ట్రస్టీ పుట్టగుంట సతీశ్ పాల్గొని స్వాములకు అన్నప్రసాదాలు వడ్డించారు. పుట్టగుంట మాట్లాడుతూ ఏటా అయ్యప్ప, భవానీ భక్తులకు అన్నదానం నిర్వహించడం సంతోషకరమన్నారు. పెద్దసంఖ్యలో అయ్యప్పస్వాములు, భవానీలు పాల్గొన్నారు.

అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్

రాష్ట్ర కార్యదర్శిగా సురేశ్ కుమార్

ఏలూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ ఫాన్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా ఏలూరు దక్షిణపు వీధికి చెందిన బరగడ సురేశ్ కుమార్‌ను నియమించారు. నిర్మాత బన్నీ వాసు ఈ నియామకానికి ఉత్తర్వులు జారీ చేశారు. హైద్రాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సురేశ్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.



అల్లు అర్జున్‌తో సురేశ్

అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గంగానమ్మ సంబరాలు వాడవాడల అత్యంత వైభవంగా నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఏలూరులో వివిధ ప్రాంతాల్లో గంగానమ్మ సంబరాలు నిర్వహించారు. పవర్ పేటలో శ్రీవిద్యాగణపతి ఆలయం వద్ద ఉన్న శ్రీగంగానమ్మ సంబరాల్లో బడేటి చంటి మీనా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివంగత మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి సతీమణి రేణుక, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, జ్యోతి దంపతులు గంటా బాబ్జీ, శీర్ల వాసు, నౌడూరి వాసు, గంటా రాంబాబు, జీ.రామ్‌గోపాల్, ఎం.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పెదపాడు, గుడిపాడు, వీరమ్మకుంట పరిసర ప్రాంతాల్లో సిబ్బందితో పోలీసులు తనిఖీలు నిర్వహించి గుడిపాడు వద్ద ఐషర్ వాహనాన్ని, అందులోని 15 వేల కిలోల చికెన్ వేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ తెలిపారు.

ఘనంగా గంగానమ్మ సంబరం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక 3, 4 డివిజన్ల పరిధిలోని గంగానమ్మ, పోతురాజు బాబుల ఆలయం వద్ద ఆదివారం వార్షిక సంబర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి, పోతురాజుబాబులకు 101 బిందెలతో తైలాభిషేకం నిర్వహించి పంచామృతాభిషేకాలతో ఆరాధించారు. అమ్మవారి ప్రతిమతో ఘటాచార్యులు వీధుల్లో సంచరించారు. దీంతో వీధివీధిన ఈ ఘటాచార బృందానికి స్నానోత్సవం నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ అమరావతి అశోక్‌బాబు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, మూడవ డివిజన్ కో-ఇన్‌చార్జి సిరిశెట్టి నారాయణప్రసాద్, నాల్గవ డివిజన్ ఇన్‌చార్జి రేవులగడ్డ లాలాగజతిరాయ్, కో-ఇన్‌చార్జి గంచిరి సురేష్, లొట్టి త్రినాద్, డి.వెంకటేశ్వరరావులు పాల్గొన్నా రు. కమిటీ నిర్వాహకులను అభినందించారు.





రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు. పూజా రుసుము ద్వారా రూ. 36,480, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.21,405, ఫొటోల ద్వారా రూ.2860 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీశ్ కుమార్ తెలిపారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు చెప్పారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు శ్రీరాట్నాలమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హక్కుల సాధనకు యాదవులు ఐక్యం కావాలి

▸▸ సంఘ జిల్లా అధ్యక్షుడు చింతయ్య

ఏలూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జనా బా ప్రతిపాదికన యాదవులకు గుర్తింపు ప్రాధాన్యత దక్కే వరకు ఐక్యంగా పోరాడాలని యాదవ సంఘం నాయకులు స్పష్టం చేశారు. యాదవ సంఘం భవనంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు చింతయ్య ఆధ్వర్యంలో యాదవ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారం, హక్కుల సాధనపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు చింతయ్య, ఈడ ఛైర్మన్ పెద్దిబోయిన శివ ప్రసాద్, కాట్లు బాలకృష్ణ మాట్లాడు తూ మంత్రి పార్థసారథి, ఏలూరు ఎంపీగా యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడం మన అదృష్టమన్నారు. ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఏలూరు, ద్వారకాతిరుమలలో శ్రీకృష్ణ ఆలయాలు నిర్మించనున్నట్టు తెలిపారు. అనంతరం యాదవ సంఘం జిల్లా నియోజకవర్గ అధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకోగా ప్రమాణ స్వీకారం చేయించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్, రాష్ట్ర యువ నాయకులు కాట్రు బాలు, ఏలూరు జిల్లా యాదవ సంఘం పెద్దలు, బీకేఎం నాని, నగర అధ్యక్షులు మెరుగుమాల శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్య దర్శి మల్లిపూడిరాజు, పిల్లల శ్రీనివాస్, గోల లోకేశ్వరరావు, జమలయ్య, యువరాజు, జిల్లా నల్గొండ నుంచి యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన యాదవ సంఘ నాయకులు





దివ్యశ్రీకి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్

రాష్ట్ర స్థాయి సెమినార్ పోటీల్లో జిల్లా విద్యార్థిని ప్రతిభ

ఏలూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెమినార్ పోటీల్లో ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు టెన్త్ విద్యార్థిని వై.దివ్యశ్రీ తృతీయ స్థానం లో నిలిచింది. ఈ మేరకు డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్ కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు ఓ ప్రకటనలో వివరాలు తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఇంత వరకు ప్రముఖంగా ఉండే బెంగళూరు, హైదరాబాద్‌తో పోటీపడేలా నవ్యాంధ్ర వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖకు గూగుల్ సెంటర్ రాకతో సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని, దీనిపై విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పిం చడం ద్వారా, వారిని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. ఈ మేరకు అవగాహన కల్పించడం కోసమే ఎస్సీఈఆర్టీ రాష్ట్ర వ్యాప్తంగా సెమినార్లు నిర్వహిస్తోందన్నారు. ప్రపంచ సాఫ్ట్‌వేర్ చిత్రపటంలో ఇక మీదట ఏపీ ప్రముఖ స్థానంలో ఉంటుందని వివరించారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెమినార్‌లో జిల్లా తరపున పాల్గొన్న దివ్యశ్రీ క్వాం టం సాంకేతికతకు సంబంధించి విషయాలను అనర్గళంగా వివరించి తృతీయ స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విజేత దివ్యశ్రీకి, ప్రోత్సహించిన గైడ్ టీచరు రవి కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులుకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, స్టేట్ నోడల్ ఆఫీసర్ నాగమణి బహుమతి అందజేశారు.



అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ హరీష్‌మాధుర్

కోరింగ రోప్‌వే బ్రిడ్జి పరిశీలన

తాళ్లరేవు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినా డ జిల్లా తాళ్లరేవు మండలంలోని పాత కోరింగ రోప్‌వే బ్రిడ్జిని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆదివారం పరిశీలించారు. వంతెన మరమ్మతులపై అధికారులు, నాయకుల బృం దంతో ఆయన చర్చిం చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మరమ్మతులకు మొదటి విడతగా రూ.20లక్షలు మంజూరయ్యాయని, పూర్తి కావాలంటే మరో రూ.40 లక్షలు కావాల న్నారు. శాశ్వత వంతెన నిర్మాణానికి రూ.13 కోట్లు అవసరమవు తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టీ కుమూడి లక్ష్మణరావు,టీడీపీ మం డల కార్య దర్శి డి.వెంకటర మణ, సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి బాబీ, పొన్న మండ రామలక్ష్మి, వెంటపల్లి ఉ మామహేశ్వరి, పినపోతు సోమ రాజు, చంటి, చంద్రాల ఆదినారాయణ, జవ్వాది తాతాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



సోమేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం

భీమవరం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజమాసం మాస శివరాత్రి పురస్కరించుకుని గునుపూడిలోని సోమేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణానికి చెందిన బి.శివకుమార్ గజమాలను అందించారు. ఆలయ ఈవోడి రామకృష్ణంరాజు పర్యవేక్షించారు.



సిద్ధాంతం పుష్కరాల రేవు వద్ద ఆందోళన చేస్తున్న భక్తులు...

పుష్కరాల రేవు వద్ద భక్తుల ఆందోళన

పెనుగొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం సిద్ధాంతం వశిష్ఠ గోదావరి వద్ద పుష్కరాల రేవులు అధ్వానంగా ఉండటంతో ఆదివారం భక్తులు ఆందోళన చేపట్టారు. రెండు రోజుల్లో కార్తీక మాసం ప్రారంభం కానుంది. అయితే ఈ స్నానాల రేవుల్లో దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవార్ల విగ్రహాలు నిమజ్జనం చేయడంతో విగ్రహాలు ఎక్కడివక్కడే మెట్లపై ఉండటంతో శివ స్వాములు, భక్తులు స్నానాలు చేయడానికి అనువుగా లేకుండా పోయాయి. కార్తీక మాసం ప్రారంభమైతే వందలాది మంది భక్తులు ఈ రేవుల్లోనే పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అయితే రేవులు ఒండ్రు మట్టి, దేవుళ్ల విగ్రహాలు, ఇంకా చెత్తాచెదారం ఉండటంతో భక్తులు స్నానాలు ఎలా చేసేదని ఆదివారం శివభక్తులు ఆందోళన చేపట్టారు. తక్షణం రేవుల్లో ఉన్న చెత్తాచెదారాలు, అమ్మవార్ల విగ్రహాలను తొలగించి భక్తులకు పుణ్యస్నానాలు చేయడానికి అనువుగా ఉంచాలని కోరారు.



మెట్లపై అమ్మవారి విగ్రహాలు

దీపావళి సంతోషంగా జరుపుకునేలా చర్యలు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ఎస్పీతో సమీక్షిస్తున్న కలెక్టర్

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా భద్రత మధ్య ఆనందంగా దీపావళిని జరుపుకునేలా పటి ష్ఠమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆదివా రం జిల్లాలో బాణసంచా ప్రమాదాల నివార ణపై ఎస్పీ కేపీఎస్ ప్రతాప్ శివ కిషోర్‌తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులతో టెలికాన్ఫరెన్సులో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దీపావళి సమయంలో జిల్లాలో ఎక్కడా బాణసంచా ప్రమాదాలు సంభవించకుండా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు దుకాణాల వద్ద సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో లైసెన్సు కలిగిన బాణసంచా తయారీ, నిల్వ, అమ్మ కాల షాపుల వద్ద విద్యుత్, షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాల సమయంలో మంటలను ఆర్పేందుకు ఉపయోగించే పరికరాలు తప్పనిసరిగా ఉండేలా అధికారులు తనిఖీ చేయాలని, భద్రత ఏర్పాట్లపై షాపుల యజమానులకు అవగాహన కలిగించాల న్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా పర్యవేక్షణకు జిల్లా కలెక్టరేట్ లో 18002331077 టోల్ ఫ్రీ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పా టు చేయడం జరిగిందని, అదే విధంగా అన్ని రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాణసంచా దుకాణాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించ కుండా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్లను పరిశీలించాల న్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా జిల్లా స్థాయిలో 1912 టోల్ ఫ్రీ నెంబర్‌తో 94409 02926, 94409 04037, 94910 30712 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రమాద సమయంలో కంట్రోల్ రూమ్ సిబ్బందికి సమాచారం అందిస్తే వెంటనే సహాయక చర్యలు తీసుకుంటారన్నారు. బాణసంచా షాపుల వద్ద ప్రజలు గుమిగూడ కుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాణ సంచా వల్ల కలిగే ప్రమాదాలు, నివారణా చర్యలపై ప్రజలకు అవగాహన కలిగిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు.

ఘనంగా హథీరామ్ బర్సి ఉత్సవం



బర్సి ఉత్సవంలో పాల్గొన్న నాయకులు, మహిళలు

ఏలూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దొండపాడులో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం, బంజారా భజరంగీ భేరి సంఘా ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హథీరామ్ మహాభోగ్ కార్యక్ర మాన్ని ధరావత్తు చోక్లా నాయక్ అన్నపూర్ణ దంపతుల చేతుల మీదు గా ఘనంగా నిర్వహించారు. అలిండియా బంజారా సేవా సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు బాణావతు మోహనరావు నాయక్ మాట్లా డుతూ బంజారాల ఆధ్యాత్మిక మార్గదర్శి హథీరామ్ ఏడుకొండలపైన జీవ సమాధి అయిన త్యాగదినాన్ని బర్సి ఉత్సవంగా జరుపుకుంటూ దేశ వ్యాప్తంగా అన్నీ తండాల్లో మహాభోగ్ కార్యక్రమం చేయడం బంజారాల సంప్రదాయమన్నారు. ఏబీఎస్ఎస్ సంఘ జిల్లా నాయకులు భూక్యా రమేశ్ నాయక్ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామికి బాలాజీ అని నామకరణ చేయడమే కాకుండా అతనితో పాచికలాడి దైవాన్నే ఓడించిన మహా భక్తుడు హథిరామ్ అని కొని యాడారు. బంజారా భజరంగీ భేరి సంఘ జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ హథిరామ్ మఠంలో గోర్ బంజా రాల వారసత్వ హక్కులను తిరిగి కనిపించాలని, హథిరామ్ మఠం పాలక మండలి నిర్వహణా బాధ్యతలు గోర్ బంజరాలకు అప్పజెప్పా లని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు ధరవతు శ్రీనివాస్ రావు నాయక్, వడిత్యా రమేశ్, గుగ్గులోతు రమేశ్, లావుడియా కృష్ణ కిషోర్, దారావతు హనుమంతు నాయక్, భూక్యా జ్యోతి, బాణావతు దేవి, బోడల ప్రమీల, దారావతు అరుణ పాల్గొన్నారు.

గోదావరి జిల్లాలు బీజేపీకి అడ్డా

పార్టీ రాష్ట్రాధ్యక్షుడు మాధవ్



లక్ష్మీప్రసన్న దంపతులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'గోదావరి జిల్లాలు బీజేపీకి అడ్డా... ఇక్కడ 27 శాతం ఓటింగ్ ఉంది... అనేక గెలుపులు నమోదు చేసిన చరిత్ర ఈ ప్రాం తంలో ఉంది' అని ఆ పార్టీ ఏపీ చీఫ్ వీవీఎన్ మాధవ్ అన్నారు. కా కినాడలో ఆదివారం జరిగిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రతిపక్షాలు ఊహించని ఫలితాలను బీజేపీ గతంలో నమోదు చేసిందన్నారు. పార్టీ లో పదవులు అలంకారం కాదని, ఒక బాధ్యత అన్నారు. ప్రధాన కార్యదర్శి పదవిలో వున్న వారికి పని భారం అధికంగానే ఉంటుందని, అటువంటి బాధ్యతను లక్ష్మీప్రసన్నకు అప్పజె ప్పామన్నారు. ఆమె పార్టీకి చేసిన సేవలను గుర్తు చేస్తూ బ్రాహ్మణ సమాజం రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. లక్ష్మీప్రసన్న దంపతులను గజమాలతో స త్కరించారు. కార్య క్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు,ఎంపీలు దగ్గుబాటి పు రందేశ్వరి, పీవీ సత్యనారా యణ, ఎమ్మెల్యే డా క్టర్ పార్థసారధి,మాజీ ఎమ్మెల్యే కాపు రామచం ద్రారెడ్డి, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కి. న విశ్వేశ్వరరావు, నాయకులు వేటుకూరి సూర్య నా రాయణరాజు, నిర్మలాకిషోర్ పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై విస్తృత అవగాహన

- కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- ముగిసిన ది గ్రేట్ రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవం



చిచ్చుబుడ్లు వెలగిస్తున్న కలెక్టర్ చేకూరి, జీసీ మేఘాస్వరూప్

రాజమహేంద్రవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0పై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించామని, ఇలాంటి పథకాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ప్రజా సంక్షేమ కార్యక్రమాలకే వ్యయం చేస్తారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో ఈనెల 14 నుంచి నిర్వహించిన ది గ్రేట్ రాజమహేంద్ర వరం షాపింగ్ ఉత్సవ్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక ఆనంద్ రీజెన్సీ పందిరి హాల్‌లో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ కీర్తి చేకూరితోపాటు జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. టపాసులు కాల్చి, చిచ్చుబుడ్లు వెలిగించి దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, వాహనాలు, మందులు, మిల్క్ ప్రొడక్ట్స్ తదితర విభాగాల్లో ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. జ్యూట్ బ్యాగ్‌లు, చేనేత వస్త్రాలు, వంట ఉత్పత్తులు ప్రదర్శించి, విక్రయించే అవకాశం కల్పించామన్నారు. కడియం ప్రాంతంలోని పూల వ్యర్థాలతో అగరబత్తులు తయారు చేస్తున్న మహిళా సంఘాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఈ అగర్‌బత్తీలను దేవాలయాల ద్వారా మార్కెట్ చేయడానికి అవకాశం కల్పించామన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల పన్నుల పారదర్శకతతో పాటు ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. బిల్లులు తీసుకోవడం ద్వారా పన్నుల్లో తగ్గింపు వివరాలు ప్రజలకు స్పష్టమవుతాయని చెప్పారు. ప్రతీ వినియోగదారుడు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. జనరిక్ మందుల వినియోగంపై అవగాహన పెంపు, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం, మేక్ ఇన్ ఇండియా-మేకింగ్ ఆంధ్రప్రదేశ్ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్, జీఎస్టీ నోడల్ అధికారి వై.మేఘాస్వరూప్ మాట్లాడుతూ టీవీలు, ఏసీలు, మిక్సీలు, వాషింగ్ మిషన్ల వంటి ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపుతో రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకూ ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ ఎం.సుధాకరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 4,300 అవగాహన కార్యక్రమాలు చేపట్టి జీఎస్టీ చాంపియన్లు ప్రతీ ఇంటికి వెళ్లి ధరల్లో వ్యత్యాసాలపై వివరాలు అందించారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కరరెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ టీవీ నాగేశ్వర రావు, జీఎస్టీ అధికారి హుస్సేన్ షరీఫ్, డిప్యూటీ ఈపీసీ కె.సురేష్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీ వీఎస్ మూర్తి, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లక్కీడిప్ విజేతలు..

ది గ్రేట్ రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవ్ సందర్భంగా నిర్వహించిన లక్కీ డిప్‌లో విజేతలకు కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి కొవ్వూరుకు చెందిన వల్లీ, రాజమహేంద్రవరానికి చెందిన వీటీ శ్రీనివాస్ గెలుపొందగా రెండో బహుమతి కె.చిన్ని, డి.దుర్గాభవాని, పి.లక్ష్మీదివ్య, మూడో బహుమతి ఎన్.జోగేశ్వరరావు, య.రామలక్ష్మి, ఎం.అనంతరెడ్డి గెలుపొందారు.



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, కలెక్టర్, జేసీ

ఫెన్సింగ్‌ను అమ్మాయిలూ నేర్చుకోవాలి

- కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాసు
- ముగిసిన 12వ ఏపీ సబ్ జూనియర్ అండర్-14 బాలుర, బాలికల ఫెన్సింగ్ పోటీలు



విజేతలను అభినందిస్తున్న కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాసు

సామర్లకోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు కరాటే, టైక్వాండో, వంటి క్రీడలతో బాటు ఫెన్సింగ్ క్రీడను నేర్చుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాసు అన్నారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని లక్ష్య ఇంటర్ నేషనల్ స్కూల్ ఆవరణలో రెండు రోజులపాటు నిర్వహించిన 12వ రాష్ట్ర సబ్ జూనియర్ అండర్-14 బాలుర, బాలికల ఫెన్సింగ్ క్రీడా పోటీలు ఆదివారం ముగిసాయి. ప్రారంభ, ముగింపు కార్యక్రమాలకు ఎంపీ ఉదయ్ శ్రీనివాసుతోపాటు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీవీఎస్ కృష్ణమోహన్, వి.నాగేశ్వరరావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, స్కూల్ కార్యదర్శి దీపక్‌రెడ్డి, డైరెక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాసు ఫెన్సింగ్ క్రీడ ప్రాధాన్యతను వివరించారు. సుగుణారెడ్డి మాట్లాడుతూ అత్యంత పారదర్శకతతో ఈ క్రీడాపోటీలను నిర్వహించామన్నారు. అండర్-14 విభాగంలో 13 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. వ్యక్తిగత, జట్లు విభాగాల్లో ఫాయిల్, సేబర్, ఈపీ కేటగిరిలలో పోటీలు నిర్వహించామన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ప్రథమస్థానం కర్నూలు జిల్లా, ద్వితీయ స్థానాన్ని పశ్చిమగోదావరి జిల్లా, తృతీయస్థానాన్ని తూర్పు గోదావరి జిల్లా కైవశం చేసుకున్నాయన్నారు. కాగా ఈ పోటీల్లో లక్ష్య స్కూల్లో చదువుతున్న నల్లమిల్లి శేషరిషిత్‌రెడ్డి, కె.చైత్రిక్ సహర్షరెడ్డి, ఎం.మనీష్, ఎన్.అష్టివర్ణిక శేఖర్, ఎస్.భావ్యసహజరెడ్డి, టి.సితార, బి.లక్ష్మీకృతిక, ఎల్.బృహతీఖడ్గ, ఎం.సౌమ్య, ఎ.పర్ణిక, బి.జానకి, జె.పరిణీతి, బంగారు, రజత పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. సెబర్ విభాగంలో రిషిత్‌రెడ్డి బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్టు సుగుణారెడ్డి తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ వందనబోహ్రా అభినందించారు.

విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

ఏలూరుసిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి సంద ర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణకు విద్యుత్ శాఖ తరపున జిల్లా, డివిజన్ స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ పి.సాల్మన్‌రాజు ఆదివారం తెలిపారు. జిల్లా స్థాయిలో టోల్ ఫ్రీ నెంబర్ 1912తో పాటు 94409 02926 నెంబర్, ఏలూరు డివిజన్‌లో(94409 04037), జంగారెడ్డిగూడెం డివి జన్‌లో(94910 30712) కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేశామ న్నారు. జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ సరఫరా, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు సంభవిస్తే సహాయం కోసం 94408 12702, 94408 12703, 94408 12704, 94910 49797 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్ఈ తెలిపారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):రాట్నాలకుంట శ్రీరా ట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సు దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలిని నై వేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు. పూజా రుసుము ద్వారా రూ. 36,480, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.21,405, ఫొటోల ద్వారా రూ.2860 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీశ్ కుమార్ తెలిపారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పా ట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు చెప్పారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు శ్రీరాట్నాలమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు.



ఇఫ్టూ నాయకులు, కార్యకర్తల ప్రదర్శన

కార్మిక వర్గంపై దాడులకు వ్యతిరేకంగా పోరాటం

- సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ కార్మికులకు పిలుపు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలు హరించేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తు న్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు బి.సోమయ్య పిలుపునిచ్చారు. నవంబరు ఒకటి నుంచి నాలుగు రోజుల పాటు ఏలూరులో జరిగే ఇఫ్టూ రాష్ట్ర రాజకీయ తరగతుల నిమిత్తం ఆదివారం పలు కాలనీల్లో ప్రచార ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం పని గంటలు పెంచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గంపై దాడి చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికవర్గం రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. ఇఫ్టూ నాయకులు యు.వి, బద్దా వెంకట్రావు, యర్రా శ్రీనివాసరావు, రమణ, చిన్నబ్బాయి, శ్రీను, రమేష్, అప్పారావు, వెంకటేశ్వరరావు, నెహ్రూబాబు, గంగరాజు, విజయ్, త్రినాథ్, దుర్గారావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మద్యం తాగని వ్వడం లేదని ఓ యువకుడు తీవ్ర మనస్థాపానికి గురై శని వారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతం నేరెళ్లరాజా కాలనీకి చెందిన గుడిపూడి చంద్రమౌళి(32)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పో షిస్తున్నాడు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. గత కొద్ది రోజులుగా మద్యం తాగనివ్వకుండా కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారు. దీంతో మనస్థాపానికి గురైన చంద్రమౌళి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెం టనే అతనిని ఉరి నుంచి దింపి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీ సులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

కూతురినే కాటేసిన కామాంధుడు

నరసాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):నరసాపురం పట్టణంలో దారుణం చోటు చేసుకొంది. మద్యం మత్తులో కన్న కూతురిపై తండ్రి అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఆదివారం టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ యాదగిరి వివరాల ప్రకారం పట్టణంలోని ఓ వార్డులో నివాసం ఉంటున్న వ్యక్తి కూలి పని చేస్తుంటాడు. ఇతడి భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఈ ఏడాది జూలైలో ఈ వ్యక్తి మద్యం సేవించి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో తొమ్మిదో తరగతి చదవుతున్న అతని చిన్న కుమార్తె (13) తలుపు తీసింది. అప్పటికే మత్తులో ఉన్న తండ్రి కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించడంతో అక్కచెల్లెళ్లిద్దరూ గోప్యంగా ఉంచారు. ఇటీవల తల్లి గల్ఫ్ నుంచి రావడంతో ఆమెకు ఈ విషయాన్ని చెప్పారు. తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు. ఇన్‌ఛార్జి డీఎస్పీ విశ్వనాథ్ విచారణ చేస్తున్నట్లు వివరించారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు సమీపంలోని వట్లూరు నెహ్రూకాలనీకి చెందిన ముని దుర్గా ప్రసాద్ (49)కి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివా హం చేయగా కుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నా డు. దుర్గా ప్రసాద్ కార్పెంటర్‌గా వృత్తి కొనసాగిస్తున్నాడు. కొంతకాలం నుంచి దుర్గా ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. ఆ బాధను భరించలేక ఈ నెల 18వ తేదీ రాత్రి తన ఇంట్లో అందరూ పడుకున్న తరువాత తలుపులు వేసుకుని ఉరి వేసుకున్నాడు. ఆదివారం ఉదయం చూసేటప్పటికి తలు పుతీయడం లేదు. దీంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో తలుపులు తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ సం ఘటనపై ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వ హించి బంధువులకు అప్పగించారు.

పోలవరం నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

కుక్కునూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):మూడు నెలలుగా గోదావరి వరద కుక్కునూరు మండలాన్ని చుట్టుముట్టడంతో వ్యవసాయ పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్ర రావు డిమాండ్ చేశారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీలకు పనులు దొరక్క వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.సాయికిరణ్, షేక్ ఖాసిం, నాగేశ్వరరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు స్కూల్ గేమ్స్

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) డివిజన్ స్థాయిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల హెచ్‌ఎం పి.సోమశేఖర్ ఆదివారం తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగ పోటీల్లో ప్రతిభావంతులు జిల్లా స్థాయి పోటీలకు అర్హులవుతారన్నారు. డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని హెచ్‌ఎం సోమశేఖర్ కోరారు.

పత్తికొనుగోలు కేంద్రాన్ని
ఏర్పాటు చేయాలి

» సీపీఐ మండల సమితి నాయకుల డిమాండ్

కుక్కునూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రైతాంగం పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు కుక్కునూరు మండల కేంద్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం, సీపీఐ మండల సమితి నాయకులు కోరారు. ఆదివారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య మాట్లాడుతూ సీసీఐ కేంద్రం లేకపోవడంతో పత్తిని ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఉంటుందన్నారు. రైతాంగం ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులు తక్కువ ధరకే కొనుగోలు చేసి రైతులను నిలువుదోపిడి చేస్తున్నారని అన్నారు. సీసీఐ కేంద్రం ఏర్పాటు చేస్తే రైతుకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయడం వలన రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. రైతులు సంఘం జిల్లా నాయకులు ఎం.వెంకటాచారి, వి.శ్యామలా, కె.బాబూరావు పాల్గొన్నారు.

తగ్గిన అమ్మకాలు

వ్యాపారులను వెంటాడుతున్న వర్షాలు
నేడు విక్రయాలు సాగుతాయంటూ ఆశలు

చింతలపూడి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆదివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షంతో బాణాసంచా దుకాణాల వద్ద ఆదివారం జనంలేక వెలవెలబోయాయి. స్థానికంగా నాలుగు దుకాణాలకు అనుమతినిచ్చారు. వీటిని శనివారం ప్రారంభించారు. నగర పంచాయతీలో ప్రతీ ఏటా అన్ని వర్గాల ప్రజలు బాణసంచాను సరదాగా కాల్చుకుంటారు. అయితే గత ఏడాది కంటే ఈ ఏడాది అమ్మకాలు నీరసించాయి. దీపావళి రోజు ఎండకాస్తే ఈ అమ్మకాలు ఒక్కరోజునే జోరుగా సాగుతాయని, ప్రజలు కూడా అదేరోజు కొనే ఆనవాయితీకి వచ్చారు. ఇది సర్వసాధారణమేనని ధరలు పెరిగినా పిల్లలు, యువకుల కోసం కొనుగోళ్లు తప్పవని పెద్దలు చెబుతున్నారు. కాగా డీసీఎంఎస్ బ్రాంచ్‌లో గతంలో స్టాండర్డ్ కంపెనీ బాణసంచా విక్రయించేవారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ అమ్మకాలు చేయడంలేదు. స్థానికంగా ప్రమిదలు, వివిధ రకాల బొమ్మలతో కూడిన మట్టి ముద్దలు, పలు రకాలు మార్కెట్‌లో ఉన్నా అమ్మకాలు లేక వెలవెలబోతున్నాయి.

లింగపాలెం మండలంలో జోరుగా..

లింగపాలెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా గ్రామాల్లో ఒక రోజు ముందు నుంచే బాణసంచా విక్రయాలు జోరుగా సాగాయి.పిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో వచ్చి బాణసంచా కొనుగోలు చేస్తున్నారు. స్థానిక ఎస్ఐ కె.వెంకన్న వ్యాపారులకు పలు సూచనలు చేశారు. బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా ఇసుక, నీరు, ఫైర్ సేఫ్టీ పరికరాలతో పాటు అమ్మకాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలన్నారు. చిన్నపిల్లలు బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎస్.ఐ. పవన్ కుమార్ పరిశీలన..



పోలవరంలో భద్రతను పరిశీలిస్తున్న ఎస్ఐ పవన్ కుమార్

పోలవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం బాణసంచా అమ్మకాలు జోరుగా కొనసాగాయి. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఉన్న దుకాణాలను పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ సిబ్బందితో కలిసి లైసెన్సులు, బాణసంచా అమ్మకాల వద్ద భద్రతా ఏర్పాట్లు స్వయంగా పరిశీలించారు. ఎలాంటి అవాంచనీయ సంఘట నలకు తావు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని బాణసంచా వ్యాపారులకు సూచించారు.



గుర్రపు డెక్కతో నిండిపోయిన చెరువు

గుర్రపు డెక్క నుంచి విముక్తి కల్పించండి..

లింగపాలెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):లింగపాలెం- కొత్తపల్లి రోడ్డులో సరమ్మతల్లి దేవాలయం ఎదురుగా ఉన్న చెరువులో గుర్రపుడెక్క విస్తరిస్తూ చెరువును పూర్తిగా ఆక్రమించేస్తోంది. చెరువు మొత్తం గుర్రపు డెక్కతో నిండిపోయింది. దీంతో చెరువుల్లో నీటినిల్వ సామర్థ్యం తగ్గడంతో పాటు వాటిలో పేరుకుపోతున్న వ్యర్థాలతో దుర్వాసన వస్తుండటంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు దుర్వాసన తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారికి, సరమ్మతల్లి, వెంకటేశ్వరస్వామి ఆలయాలకు పక్కనే ఉన్న ఈ చెరువు నిండా విస్తరించిన గుర్రపుడెక్క దూరం నుంచి చూస్తే పంటపొలంలో పచ్చని తివాచీ పరిచినట్టు కనిపిస్తుంది.

కంపు కొడుతున్న సరమ్మతల్లి ఆలయం వద్ద చెరువు

స్థానికులకు ఆహ్లాదాన్ని పంచుతూ పంట పొలాలకు నీరందించాల్సిన ఈ చెరువు అధికారుల నిర్లక్ష్యానికి గురవుతోంది. చెరువు మొత్తం గుర్రపు డెక్క, చుట్టుపక్కల వారు పడవేసే పలురకాల వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తుండటంతో పక్కనే ఉన్న ఆలయానికి వచ్చే భక్తులు, స్థానికులు, వ్యాపారులు, బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చెరువును శుభ్రపరచడంతో పాటు వ్యర్థాలు వెయ్యకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గాన్ని క్రీడారంగంలో మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ప్రభుత్వ హైస్కూల్లో నిర్మాణంలో నిలిచిపోయిన ఇండోర్ స్టేడియాన్ని పూర్తి చేయడానికి శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడును కలిసి వివరించామన్నారు. నియోజకవర్గంలో జిల్లా నుంచి జాతీయస్థాయి వరకు క్రీడాకారులు ఎందరో ఉన్నారని, సరైన సౌకర్యాలు లేక వీరిలో నైపుణ్యం పెరగడంలేదన్నారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎనిమిదేళ్లుగా ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు నిలిచిపోయాయని ప్రస్తావించగా శాప్‌ఛైర్మన్ నియోజకవర్గంలో పర్యటించి తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపినట్టు చెప్పారు.



ఆందోళన చేస్తున్న నాయకులు.. చికిత్స పొందుతున్న బాలుడు

కులం పేరుతో దూషిస్తూ
దళిత బాలుడిపై యువకుల దాడి

విజయవాడలో చికిత్స పొందుతున్న బాలుడు
న్యాయం చేయాలంటూ దళిత సంఘం రాస్తారోకో

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):మండలంలోని వేగవరం గ్రామంలో ఈ నెల ఐదవ తేదీన దసరా ఉత్సవాల్లో భాగంగా డీజే చూడటానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన బేతాళ నాగ చైతన్య అనే దళిత బాలుడిని కులం పేరుతో తిట్టి నలుగురు యువకులు దాడికి పాల్పడటంతో బాలుడి కడుపులో తీవ్ర గాయాలై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా బాధిత బాలుడికి న్యాయం చేయాలని కోరుతూ వేగవరం గ్రామంలోని జాతీయ రహదారిపై అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రాస్తారోకో నిర్వహించారు. అంబేద్కర్ యూత్ సభ్యుడు లక్కాబత్తుల రమణ మాట్లాడుతూ వేగవరం గ్రామంలో దసరా ఉత్సవాల్లో చివరి రోజు ఊరేగింపు జరుగు తుండగా టెన్త్ చదువుతున్న బాలుడు నాగ చైతన్య ఆ ఊరేగింపు చూడటానికి వెళ్లగా కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఆ తరువాత బాలుడికి వాంతులయ్యాయని కొద్ది రోజుల తరువాత జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తీసుకొచ్చి స్కానింగ్ తీయించగా అన్నాశయం తీవ్రంగా దెబ్బతిందని, ప్రాంకియాస్ ట్యూబ్ చిట్లడంతో రక్తస్రావం జరిగిందని వెంటనే ఆపరేషన్ చేయాలని సూచించగా బాలుడి తల్లిదండ్రులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడని ఆపరేషన్ చేయించడానికి రూ.పది లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని చెప్పారు. పేదవాడైన బాలుడికి ప్రభుత్వమే ఆపరేషన్ చేయించి ఆదుకోవడంతో పాటు బాలుడిని కులం పేరుతో దూషించి,ప్రాణాపాయ స్థితికి తెచ్చిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

టి.నర్సాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యయప్రయాసలు సమయం వృథా కాకుండా కోపతాపాలు విడిచిపెట్టి లోక్ ఆదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉందని చింతలపూడి సివిల్ కోర్టు జడ్జి సి.హెచ్.మధుబాబు తెలిపారు. తిరుమలదేవిపేట పంచాయతీలో మల్లప్పగూడెంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో అన్ని శాఖల అధికారులు ఉండటం వలన ప్రజా సమస్యలు పరిష్కరించుకునే వీలుందన్నారు. చింతలపూడిలోని మండల న్యాయ సలహా కమిటీ అవసరమైన వారికి ఉచిత న్యాయసలహాలు అందిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తమకోర్టు పరిధిలో 4500 పెండింగు కేసులు ఉన్నాయన్నారు. ఇరువర్గాల వారికి ఆమోదయోగ్యమైతే మధ్యవర్తులు లోక్ ఆదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ సాయిబాబా, ఎంపీడీవో మణికుమారి, ఎస్.ఐ. జయబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లి ఇస్కాన్ టెంపుల్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు,

ఇస్కాన్ టెంపుల్ వద్ద ప్రత్యేక పూజలు

జీలుగుమిల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి ఇస్కాన్ టెంపుల్ వద్ద ప్రత్యే పూజలు నిర్వహించారు. వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం విద్యార్థులు ఉదయం ఆలయం వద్ద భగవద్గీత శ్లోకాలు పారాయణం, హరే కృష్ణ, హరేరామ నామాలతో 108 సార్లు జపం చేశారు. ఇస్కాన్ టెంపుల్ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరిగేలా ఆలయ నిర్వాహకులు స్థలదాతలు శ్రీమాలినీ మాతాజీ రాధాకృష్ణులకు పంచామృతాభిషేకాలు చేశారు. జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, పి.రాజవరం, వంకవారిగూడెం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

అప్పనవీడులో అయ్యప్పలకు అన్నదానం

పెదపాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప, భవానీ స్వాములకు అన్నదానం చేయడం దేవుడి సేవతో సమానమని ప్రముఖ పారిశ్రామికవేత్త, వీహెచ్‌పీ నేషనల్ ట్రస్టీ పుట్టగుంట సతీశ్ తెలిపారు. పెదపాడు మండలం అప్పన వీడు పంచాయతీ తాళ్ళమూడి అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద అభయాంజనేయస్వామి దేవాలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పారిశ్రామికవేత్త, వీహెచ్‌పీ నేషనల్ ట్రస్టీ పుట్ట గుంట సతీశ్ పాల్గొని స్వాములకు అన్నప్రసాదాలు వడ్డించారు. పుట్టగుంట మాట్లాడుతూ ఏటా అయ్యప్ప, భవానీ భక్తులకు అన్నదానం నిర్వహించడం సంతోషకరమన్నారు. పెద్దసంఖ్యలో అయ్యప్పస్వాములు, భవానీలు పాల్గొన్నారు.

ఘనంగా ధన త్రయోదశి వ్రతాలు, పూజలు



ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని దేవ దాయ శాఖ ఆధ్వర్యంలోని పాండురంగ స్వామి దేవాలయంలో ఆదివారం ధన త్రయోదశి పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకులు దండిబోట్ల కనకసుందర శర్మ, యాజ్ఞిక బృందం భక్తులతో సామూహికంగా వ్రతాలు, నోములు, అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ధనలక్ష్మీ అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి వేదికను ఏర్పాటు చేసి భక్తులతో పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకుని, భక్తి సంకీర్తనలు ఆలపించి, భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా భక్తులకు దేవాలయం ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తుల కు తగు ఏర్పాట్లు చేశారు.ధనలక్ష్మీ అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది.

పట్టిసీమలో ఉచిత హోమియో మందుల పంపిణీ నిలిపివేత

పోలవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ శ్రీ రామకృష్ణ గీతాశ్రమంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత హోమియో మందుల పంపిణీని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఆదివారం ఆశ్రమ నిర్వహకురాలు మాతాజీ నందుల స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ రాజమహేంద్రవరం జగద్గురుపీఠం నిర్వహిస్తున్న ఉచిత హోమియో మందుల పంపిణీని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేస్తున్నట్టు పట్టిసీమ గ్రామానికి చెందిన తెలగంశెట్టి వేంకటేశ్వరరావు అతని బంధువులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆశ్రమాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో మందుల పంపిణీ, వైద్య సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలిపారు. ఆశ్రమ భక్తుడు డాక్టర్ బీరా విజయబాబు మాట్లాడుతూ ఆశ్రమాన్ని తెలగంశెట్టి వేంకటేశ్వరరావు అతని బంధువులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని విశ్వహిందూ పరిషత్‌కి అప్పగించాలని చూస్తున్నారని ఈ విషయంపై మాతాజీ ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు విచారణ చేసి ఆశ్రమం ఉన్న భూమి ప్రభుత్వ భూమి గ్రామకంఠం అని స్పష్టం చేశారన్నారు. వివాదాలు పరిష్కారం అయ్యేవరకూ మరో మూడు వారాలు ఉచిత హోమియో మందుల పంపిణీ వైద్య సేవలు పునరావృతమవుతాయని మాతాజీ తెలిపారు.